సాక్షి
వికారాబాద్
గురువారం । 7 । మార్చి । 2024




వెతలు తీరవు

రైతు వేదిక నిర్మాణాలకు సంబంధించి బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు మొరపెట్టుకుంటున్నారు. 8లో ▸



చూసొద్దాం రండి..

అంతారం తండాలో వెలసిన ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం భూకైలాస్ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. 8లో ▸



అడ్డగోలు పర్మిషన్లు!

ప్రభుత్వ, ప్రైవేటు పనుల పేరుతో యాలాల రెవెన్యూ అధికారులు జారీ చేస్తున్న అనుమతులు చర్చకు దారి తీస్తోంది. 9లో ▸

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటిన మోక్ష



మోక్షకు సైకిల్ అందజేస్తున్న ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు

తాండూరు టౌన్: ఇటీవల ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పోటీలో తాండూరు పట్టణానికి చెందిన నేతాజీ గురుదేవ్ గురుకుల పాఠశాల 8వ తరగతి విద్యార్థి మోక్ష సత్తా చాటింది. అత్యధిక శ్లోకాలు చెప్పిన మోక్షకు ఇస్కాన్ సంస్థ సైకిల్‌ను బహుమతిగా అందజేసింది. అలాగే తాండూరు స్థాయిలో నిర్వహించిన పోటీల్లో అదే పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి జస్విక, 3వ తరగతి విద్యార్థి వేదవ్యాస్ బహుమతులు సాధించారు. విజేత విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ మణిమాల, ప్రిన్సిపాల్ శివలీల, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ రిజర్వేషన్లు ఖరారు



కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. కొడంగల్ బీసీ జనరల్, కోస్గి ఎస్సీ జనరల్‌కు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కొత్త రిజర్వేషన్ల ప్రకారం నూతన పాలక వర్గాలను ప్రభుత్వం త్వరలో నియమించనుంది. తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చట్టం ప్రకారం ప్రతి మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తారు. గతంలో ఈ రెండు మార్కెట్లలో బీఆర్‌ఎస్ నాయకులు పాలక వర్గంలో ఉండేవారు. రాష్ట్రంలో అధికారం మారిన తర్వాత నామినేటెడ్ పదవులకు కొందరు రాజీనామా చేశారు. మరి కొందరు అలాగే కొనసాగుతుండడంతో పాలక మండళ్లను ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అన్ని కమిటీలకు కొత్త పాలక వర్గాలను ఎన్నుకోవాల్సి ఉంది.

ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో నగరవాసి మృతి

- పాతబస్తీకి చెందిన అఫ్సాన్ చనిపోయినట్టు ధ్రువీకరణ
- రష్యాలోని భారత రాయబారి కార్యాలయం నుంచి సమాచారం

సాక్షి, సిటీబ్యూరో: ఉపాధి, అధిక వేతనం ఆశ..ఏజెంట్ల మోసం కారణంగా పాతబస్తీకి చెందిన ఓ యువకుడు రష్యాలో మృత్యువాత పడ్డాడు. బజార్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ అఫ్సాన్ ఉద్యోగం కోసం రష్యాకు వెళ్లగా.. ఏజెంట్ల చేతిలో మోసపోయి రష్యాలోని పుతిన్ ప్రైవేట్ సైన్యంలో చేరాల్సి వచ్చింది. ఇతను ఉక్రెయిన్‌తో యుద్ధంలో పాల్గొని అక్కడే అసువులు బాశాడు. ఈమేరకు రష్యాలోని భారతీయ రాయబారి కార్యాలయానికి సమాచారం అందింది. వారు బుధవారం అఫ్సాన్ సోదరుడు ఇమ్రాన్‌కు ఫోన్ చేసి ఈ విషయం తెలిపారు. దీంతో బజార్‌ఘాట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా అఫ్సాన్ దీన స్థితిని వివరించి కాపాడాలని ఇక్కడి ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే తన సోదరుడు చనిపోయాడని ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. నారాయణ్‌పేట్‌కు చెందిన మహ్మద్ సుఫియాన్ అనే మరో యువకుడు ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకుపోయాడని, కనీసం అతడినైనా కాపాడాలని ఇమ్రాన్ విజ్ఞప్తి చేశాడు. ఆయన ఇక్కడ సాక్షి ప్రతినిధితో మాట్లాడుతూ తన సోదరుడిని బాబా బ్లాక్స్ కంపెనీ ఉద్యోగంలోకి తీసుకుందని, ఆ సంస్థ దుబాయ్, ఢిల్లీ, ముంబైలో కార్యాలయాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారత్ నుంచి వెళ్లిన వారికి ఆర్మీ హెల్పర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని ఏజెంట్లు చెప్పారని, చివరికి వారిని సైన్యంలోకి చేర్చి ఉక్రెయిన్ సరిహద్దుల్లో మోహరించినట్లు వివరించారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని వ్యాపారస్తులంతా ట్రేడ్ లైసెన్స్ తప్పక తీసుకుని పుర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి కోరారు. 2023–24 సంవత్సరంలో లైసెన్స్‌లు తీసుకున్నవారు 2024–25 ఆర్థిక సంవత్సరానికి మార్చి 31లోపు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. లేదంటే 25 శాతం జరిమానా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఈఈ హరీశ్, మున్సిపల్ సిబ్బంది భానుమతి, రోజా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దిస్

కొడంగల్ బస్టాండ్‌లో సదుపాయాలు కరువు

- వేసవిలో తాగునీటికి ఇబ్బంది
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు



కనీస వసతులు లేని కొడంగల్ బస్టాండ్, చెట్టు కింద కూర్చున్న ప్రయాణికులు



కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ బస్టాండ్‌పై ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిత్యం వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ సదుపాయాలు మాత్రం లేవు. వేసవిలో ప్రయాణికులకు తాగునీరు దొరకని పరిస్థితి. బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఉచిత మరుగుదొడ్లు ఉన్నా కొందరు డబ్బు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మరుగు దొడ్ల వద్ద సిబ్బంది ఉండటంతో వాటిని వినియో గించుకునేందుకు మహిళలు, విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు.దీంతో బహిరంగ ప్రదేశాల్లో వారి అవసరాలు తీర్చుకుంటున్నారు. చీకటి పడితే బస్టాండ్ అంధకారంలో ఉంటోంది.చిన్న బల్బు ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొడంగల్ బస్టాండ్‌పై ఆర్టీసీ అధికారుల నియంత్రణ కరువైంది.

పేరుకే పెద్ద బస్టాండ్

తెలంగాణ – కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో కొడంగల్ బస్టాండ్ ఉంది. జిల్లాల విభజనకు ముందు కొడంగల్ నియోజకవర్గం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉండేది. అయితే కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ మాత్రం తాండూరు డిపో మేనేజర్ పరిధిలో ఉండేది. జిల్లాలు వేరుపడిన తర్వాత కొడంగల్‌తోపాటు ఆర్టీసీ బస్టాండ్ కూడా వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చింది. జిల్లాలో విలీనం జరిగిన తర్వాత కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు జాప్యం చేశారు. గత ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రి స్థానికుడైనా పెద్దగా మార్పు కనిపించలేదు. రాత్రి వేళ బస్టాండ్ ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోలీసులు, ఆర్టీసీ అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సు వెనుక బస్సు

ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటించగానే డ్రైవర్లు, కండెక్టర్లలో ఓపిక నశించింది. వందలాది మంది మహిళలు ప్రయాణాలు సాగించడం వల్ల బస్సులన్నీ ఒకదాని వెనుక ఒకటి వస్తున్నాయి. తాండూరు – మహబూబ్‌నగర్ మార్గంలో నిత్యం వరుసగా ఒకేసారి ఐదారు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ తరువాత మళ్లీ రావడానికి చాలా సమయం పడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. డిపో అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విస్తరణకు నోచుకోవడం లేదు

కొడంగల్ బస్టాండ్ విస్తరణకు నోచుకోవడం లేదు. ఒకేసారి ఐదారు బస్సులు వస్తే ట్రాఫిక్ జాం అవుతోంది. బస్సులు ఆపే ప్లాట్ ఫారాల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్ స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని అంటున్నారు. 40 ఏళ్ల క్రితం కొడంగల్‌లో బస్టాండ్‌ను నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ముఖ్యమంత్రి రేవంత్ కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో భవిష్యత్తులో బస్టాండ్ రూపురేఖలు మారుతాయని ప్రయాణికులు భావిస్తున్నారు.



హారతి ఇస్తున్న ప్రసాద్‌కుమార్ తదితరులు

దైవ చింతన ఉండాలి

స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ప్రతి ఒక్కరికీ దైవ చింతన ఉండాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా శివరాత్రి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. మంచిని పంచుతూ ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో శివలింగాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, బ్రహ్మకుమారీస్ నిర్వాహకురాలు మధు అక్కయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, మాజీ జెడ్పీటీసీలు మహిపాల్‌రెడ్డి, షరీఫ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, కౌన్సిలర్ గోపాల్, నాయకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

మొయినాబాద్: రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతువేదికల్లో ప్రభుత్వం వీడి యో కాన్ఫరెన్స్‌లను ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. బుధవా రం ఆమె మొయినాబాద్ రైతువేదికలో ఏర్పా టు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను పరిశీ లించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను తెలియజేయవచ్చాన్నారు. రైతులు పంటలకు సంబంధించిన సమస్యలు, ఇబ్బందులను అధికారులు, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్ల వచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఏఈఓలు సునీల్, కుమార్ తదితరులు ఉన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

త్వరలో ఇందిరమ్మ కమిటీలు

- వాటి ద్వారానే సంక్షేమ పథకాల అమలు
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: త్వరలో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు వేయనున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వాటి ద్వారానే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో లేకున్నా కార్యకర్తలు కాంగ్రెస్‌ను నమ్ముకొని పని చేశారని తెలిపారు. వారి రుణం తీర్చుకుంటామన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో కార్యకర్తలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రతి గ్రామంలో 5 మందితో ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సీఎం రూ.140 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, నాయకులు రఘువీరా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనందం, సత్యాహరిశ్చందర్, హన్మంతు ముదిరాజ్, పార్థసారథి తదతరులు పాల్గొన్నారు.

అందని ‘ప్రోత్సాహం’

- నాలుగేళ్లుగా నగదు కోసం ఎదురుచూస్తున్న పాడిరైతులు
- ప్రభుత్వ డెయిరీకి పాలు పోసేందుకు నిరాసక్తత
- లాలాపేట్ విజయ డెయిరీ ఎదుట ఆందోళన



పాల సేకరణ కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న పాడి రైతులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ డెయిరీలకు పాలు పోసిన పాడి రైతులకు పరేషాన్ తప్పడం లేదు. లీటరుకు రూ.4 చెల్లించే నగదు ప్రోత్సాహాన్ని నాలుగేళ్లుగా నిలిపివేడయంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. బహిరంగ మార్కెట్లో దాణా, ఎండుగడ్డి ధరలు భగ్గుమంటుండడం, బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చెల్లింపులు తక్కువగా ఉండడంతో పాడి రైతులకు నష్టాలను తెచ్చిపెడుతోంది. ప్రభుత్వం తమకు బకాయి పడిన ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం విజయా డెయిరీ ఎదుట ఆందోళనకు దిగడం గమనార్హం.

వెన్నశాతాన్ని బట్టే ధర

మారుమూల గ్రామాల రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం జిల్లాలో ఒక డెయిరీ, మరొక శీతలీకరణ కేంద్రం సహా 12 మినీ శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 309 గ్రామాల నుంచి రోజుకు సగటున 84,429 లీటర్ల పాలసేకరణ జరుగుతోంది. రైతులు పోసిన పాలకు వెన్న శాతాన్ని బట్టి ధర నిర్ణయిస్తారు. గేదే పాలకు కనిష్టంగా వెన్నశాతం 5 ఉన్న లీటరు పాలకు రూ.40.05, వెన్న శాతం పది ఉంటే రూ.80.10 చెల్లిస్తుంది. ఆవుపాలకు వెన్నశాతం కనిష్టంగా మూడు శాతం ఉంటే రూ.40.25 చొప్పున, 4.9 శాతం ఉంటే రూ.46.90 చొప్పన చెల్లిస్తుంది.

డిమాండ్‌కు సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం

గ్రేటర్ వాసుల అవసరాలు తీర్చాలంటే రోజుకు సగటున 25 లక్షల లీటర్ల పాలు అవసరం కాగా, ప్రభుత్వ డెయిరీలు ఐదు లక్షల లీటర్లకు మించి సరఫరా చేయడం లేదు. సరిహద్దు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం ఎండలు భగ్గున మండుతుండటం, పశువులకు పచ్చి మేత ఆశించిన స్థాయిలో లభించక పోవడంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గింది. డిమాండ్‌కు సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం నమోదవుతుండటంతో పాల వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. కృత్రిమ పాలను తయారు చేసి, గేదే పాలుగా నమ్మించి కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు.

రూ.36 కోట్లకుపైగా బకాయి

డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతులకు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. విజయ పాడి రైతులకు తెలంగాణ ప్రభుత్వం 2014 నవంబర్ 1న లీటర్‌కు రూ.4 చొప్పున నగదు ప్రోత్సాహకం ప్రకటించింది. 12,621 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. కాగా 2020 ఏప్రిల్ నుంచి ఈ చెల్లింపులు నిలిపి వేసింది. దీంతో అప్పటి నుంచి రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఇలా జిల్లా రైతులకు ప్రభుత్వం రూ.36 కోట్లకు పైగా బకాయి పడింది.

కాంగ్రెస్‌లో కోల్డ్ వార్..!

- మూడు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు
- తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని పలువురి కినుక
- పాత, కొత్త నేతల మధ్య కుదరని సఖ్యత
- తొలిసారి కాంగ్రెస్ కండువాతో తాండూరుకు రానున్న సునీతారెడ్డి
- నేడు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం



తాండూరు: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. హస్తం పార్టీకి ఇక్కడ బలమైన కేడర్ ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త అభ్యర్థిని గెలిపించుకున్నారు. ఎన్నికల అనంతరం రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. తాండూరులో ఒక్క తాటిపై ఉన్న నేతలు ఇప్పుడు మూడు వర్గాలుగా చీలిపోయారు. ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకుంటున్నారు. ఆరు దశాబ్దాల పాటు స్థానిక మహరాజులు పార్టీని సమర్థవంతంగా నడిపారు. వారి కుటుంబం నుంచి మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పారు. అనంతరం జరిగిన పరిణామాలతో మహరాజులు పార్టీపై పట్టు కోల్పోయారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తాండూరు కాంగ్రెస్‌లో కోల్డ్ వార్ తలనొప్పిగా మారిందనే చెప్పవచ్చు. నేతలు మూడు వర్గాలుగా చీలిపోయారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వర్గం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహరాజ్, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సొంత కేడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ముగ్గురి మధ్య ఆధిపత్య పోరుకు తెరలేచింది.

కుదరని సమన్వయం

అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే కాంగ్రెస్ పార్టీలోకి వలసలు పెరిగాయి. నేటికీ ఈ పరంపర కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ గెలుపునకు కృషి చేసిన తమకు ప్రాధాన్యత లేకుండా పోతోందని సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి ఎవరినీ చేర్చుకోమని నేతలు హామీ ఇచ్చినట్లు పలువురు పేర్కొన్నారు. అయితే అందుకు భిన్నంగా బీఆర్‌ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని పలువురు నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. చేరికల విషయంలో తన ప్రమేయం లేదని, పార్టీ పెద్దల సమక్షంలోనే జరుగుతున్నాయని చెప్పినట్లు తెలిసింది.

నేటి సమావేశం పైనే అందరి దృష్టి

తాండూరులో నేడు(గురువారం) కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహర్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహరాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి హాజరు కానున్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకున్న తరువాత మొదటి సారి పట్నం సునీతారెడ్డి తాండూరు సమావేశానికి వస్తున్నారు. గ్రూపు రాజకీయాల నేపథ్యంలో ఈ సమావేశం సాఫీగా సాగుతుందా..? లేదా అనే చర్చ జరుగుతోంది.

ఓటరు నమోదుకు చొరవ చూపండి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ అర్బన్: ఓటరు నమోదుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఓటరు ముసాయిదా తుది జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పాత ఓటరు కార్డు స్థానంలో కొత్త కార్డు పొందవచ్చని తెలిపారు. జిల్లాలో 9,84,068 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 4,86,109 మంది పురుషులు, 4,97,920 మంది స్త్రీలు, 39 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నిక ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందని తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

మోమిన్‌పేట: ధరణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేయరాదని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటల శిఖం భూములను ఎవరైనా పట్టా భూముల్లో కలుపుకొంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పట్టణ శివారులో వెలసిన వెంచర్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఆర్‌ఐ రాజు, సర్వేయర్ గౌస్ పాల్గొన్నారు.



మోమిన్‌పేట సమీపంలోని వెంచర్‌ను పరిశీలిస్తున్న లింగ్యానాయక్ తదితరులు

భూ సమస్యలు పరిష్కరించండి

మర్పల్లి: ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులను కార్యాలయం చుట్టు తిప్పుకోరాదని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తేవాలన్నారు. అంతకుముందు రైతులతో మాట్లాడి భూ సమస్యల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: నిర్ణీత గడువులోగా ధరణి సమస్యలను పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం ఆయన బంట్వారం రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ నెల 9వ తేదీలోగా ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐలు విజయ్‌భాస్కర్, తులసీరామ్, సీనియర్ అసిస్టెంట్ రాజేందర్, జీపీ మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్ పార్టీకి పరిమళ గుడ్‌బై



తాండూరు టౌన్: తాండూరు పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పరిమళ బీఆర్ఎస్ పార్టీని వీడారు. ప్రస్తుతం ఆమె బీఆర్ఎస్ పట్టణ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆమె పదవికి, అలాగే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌కు బుధవారం రాజీనామా లేఖను అందజేశారు. గతంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అనుచరురాలిగా ఉన్న ఆమె, అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గంలో చేరారు.

'కేసు నమోదు చేయడం అన్యాయం'

తాండూరు టౌన్: హోటల్ ముందు షెడ్డు నిర్మించే విషయంలో జరిగిన ఘర్షణలో తనపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం అన్యాయమని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నయీమ్(అప్పు) ఓ ప్రకటనలో తెలిపారు. వార్డు కౌన్సిలర్ మెహ్రాజ్‌బేగం భర్త అయిన తాను గొడవ జరగకుండా సర్ది చెప్పేందుకు అక్కడికి వెళ్లానన్నారు. అక్కడే ఉన్న రాహుల్ తనకు తెలియదని, అతన్ని కులం పేరుతో దూషించలేదని తెలిపారు. పోలీసులు విచారణ జరిపి తనపై నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు తొలగించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీలోకి మాజీ కౌన్సిలర్లు



కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్లు, యువ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ కౌన్సిలర్లు పరిమళ, బిర్కట్ ఉష, యువ నాయకుడు బిర్కట్ రఘు, సంకేత్, సిద్దు, వెంకటేష్‌తో పాటు మరికొందరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రజల మన్ననలు పొందిందని, కాంగ్రెస్ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరడం హర్షణీయమని ఎమ్మెల్యే తెలిపారు.

నైపుణ్య నమూనాల ప్రదర్శన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్ : మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం నైపుణ్య నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల హెచ్‌ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయినీ సంధ్య ఆధ్వర్యంలో టీఎల్‌ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) మేళా నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లిష్‌కు సంబంధించి అవరోహణ ఆరోహణ స్థాన విలువలు, అగ్ని పర్వతం, నమూనా గుణింతాలపై పోటీ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బిల్లులు రావు.. వెతలు తీరవు!

- రైతు వేదిక పనులపై మాజీ సర్పంచుల ఆవేదన
- నిధులు మంజూరు చేయాలని మొర



పెద్దేముల్‌లో నిర్మించిన రైతు వేదిక

పెద్దేముల్: రైతు వేదిక నిర్మాణాలకు సంబంధించి నగదు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు మొరపెడుతున్నారు. పనులు పూర్తి చేసి నెలలు దాటినా డబ్బులు అందక.. వడ్డీలు కట్టలేక.. నానా ఇబ్బందులు పడుతున్నామని లబోదిబోమంటున్నారు. నిర్మాణ సమయంలో పనులు చేసిన వెంటనే నిధులు మంజూరు చేస్తామని అధికారులు చెప్పారు. కానీ పనులు పూర్తయిన బిల్లుల విషయంలో ఎందుకు పట్టించుకోవడంలేదని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. పెద్దేముల్ మండలంలోని ఇందూర్, మంబాపూర్, కందనెల్లి, పెద్దేముల్, తట్టెపల్లి, గోపాల్‌పూర్ గ్రామాలకు ప్రభుత్వం 2021లో రైతు వేదికలను మంజూరు చేసింది. ఓ రైతు వేదికకు ప్రభుత్వం సుమారు రూ.22లక్షల వరకు నిధులు కేటాయించింది.

అదనంగా నిధులు వెచ్చించి

రైతు వేదిక పనులకు బిల్లులు సరిపోక పోవడంతో అప్పట్లో సర్పంచ్‌లు అదనంగా నిధులు వెచ్చించి పనులు చేశారు. సుమారు రూ.25లక్షల వరకు నిధులు ఖర్చు అయినట్లు సంబంధిత అధికారులు తెలియచేశారు. ప్రస్తుతం అన్ని గ్రామాలల్లో పనులు పూర్తి చేసి ఏడాది దాటినా ఇంత వరకు బిల్లులు రావడం లేదని వాపోతున్నారు. మంబాపూర్ గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న సబితారెడ్డి మండలంలోనే మొదట రైతు వేదికను ప్రారంభం చేశారు. అప్పట్లో సర్పంచ్ శ్రావణ్‌కుమార్ మంత్రికి బిల్లుల విషయం గుర్తు చేశారు. త్వరలో డబ్బులు వస్తాయని ఆమె హామీ ఇచ్చారు. అయినా ఇంత వరకు పూర్తి స్థాయిల్లో నిధులు రాలేదని మాజీ సర్పంచ్ మొర పెడుతున్నారు. గోపాల్‌పూర్ గ్రామంలో సుమారు రూ.2 లక్షల పైగా నిధులు రావాలని మాజీ సర్పంచ్ రాములు మదనపడుతున్నారు. ఓ రైతు వేదికకు సుమారు రూ.20 లక్షలకు పైగా నిధులు ఖర్చు పెట్టిన ప్రభుత్వం తూతూమంత్రంగా నిధులు మంజూరు చేయటంతో పనులు ఏలా చేయాలని మాజీ సర్పంచులు ప్రశ్నిస్తున్నారు. త్వరలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

రూ.2.5 లక్షల నిధులు రావాలి



రైతు వేదికలను అప్పులు చేసి నిర్మించాం. బిల్లులు రాక తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. మొత్తం రూ.2.5 లక్షల నిధులు రావాలి.

శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచ్, మంబాపూర్

వెంటనే చెల్లించాలి



గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయాలి. రైతువేదికతో పాటు, క్రిమిటోరియంకు సుమారు రూ.5 లక్షలకు పైగా నిధులు రావాలి. సమయానికి నిధులు రాక పనులు చేయలేక పోతున్నాం.

పద్మ, మాజీ సర్పంచ్, ఇందూరు

వడ్డీలు పెరుగుతున్నాయి



గోపాల్‌పూర్‌కు రైతు వేదిక మంజూరు కావడంతో అధికారులు వెంట బడి పనులు చేయించారు. ఏళ్లు దాటినా నేటికి పూర్తి స్థాయిల్లో బిల్లులు లేవు. అధికారులకు అడిగితే రేపు మాపు అంటున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం.

రాములు, మాజీ సర్పంచ్, గోపాల్‌పూర్

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

- జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్
- ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



దస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

దోమ: ప్రతి దుకాణాదారుడు ఎరువులను ఈ పాస్ యంత్రం ద్వారా విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఎఫ్ఐవీఈ యాప్ ద్వారా దుకాణాలలో నిల్వ ఉన్న ఎరువులను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణాదారులు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచాలన్నారు. రైతులకు విక్రయించే ఎరువులను ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్(ఎఫ్ఐవీఈ) యాప్‌లో పొందుపర్చి, ఈ పాస్ యంత్రం ద్వారానే రైతులకు విక్రయించాలని సూచించారు. ప్రతివారం మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు 10 దుకాణాలను తనిఖీ నిర్వహిస్తారన్నారు. డీలర్ల నిర్లక్ష్యం లేకుండా చూసుకోవాలన్నారు. అధికారులు నిర్వహించిన తనిఖీలను ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి

పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్



పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

బంట్వారం: పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ సూచించారు. గాలికుంటు నివారణలో భాగంగా బుధవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని మోత్కుపల్లిలో పశువైద్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గాలికుంటు సోకితే పశువులకు కాలు గిట్టల మధ్యలో, నోటిలో పుండ్లు ఏర్పడుతాయన్నారు. ఈ వ్యాధి సోకితే పశువులకు నడవడానికి రాదని, మేత కూడా తినలేవన్నారు. గాలికుంటును నివారించకుంటే పశువులన్నింటికి వ్యాపిస్తుందన్నారు. ఇది వైరస్ ద్వారా వ్యాపిస్తుందని, పశు పోషకులు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. ముఖ్యంగా పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ వ్యాధితో సోకితే పాల ఉత్పత్తి తగ్గడంతో పాటు, పశువులు బలహీనంగా తయారవుతాయన్నారు. రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు మదన్‌మోహన్, నర్సింలు, సిబ్బంది రజియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

తహసీల్దార్ పురుషోత్తం



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన తహసీల్దార్ పురుషోత్తం

దోమ: అక్రమంగా ఇసుక తరలించి, డంప్ చేసిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ పురుషోత్తం హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని బుద్లాపూర్ అనుబంధ గ్రామమైన హుస్సేన్ నాయక్ తండాలో వ్యాపారులు అక్రమంగా ఫిల్టర్ చేసిన ఇసుకతో పాటు వాగులలో నుంచి తరలించిన ఇసుకను వ్యవసాయ పొలాల్లో నిల్వ చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్, ఎస్ఐ ఆనంద్ కుమార్‌తో కలిసి నిల్వ చేసుకున్న సుమారు 18 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను త్వరలో వేలం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్



ప్రభాకర్ యాదవ్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

తాండూరు: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనేందుకే మున్సిపాలిటీలను సందర్శిస్తున్నానని మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్ అన్నారు. బుధవారం తాండూరు మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ప్రజలకు సత్వర సేవలను అందించేలా ఉద్యోగస్తులు విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు జవాబుదారితనంగా ఉన్నప్పుడే మున్సిపల్ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. మున్సిపల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా గుర్తిస్తున్నానని త్వరలో సమస్య తీర్చడానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. అనంతరం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపరిమళ్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డిలను కలిశారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శ్రీనివాస్, ఉద్యోగులు నాగేందర్, రమేష్ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

అనంతగిరి: ప్రతి విద్యార్థిని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఏపీ కళాశాలలో విద్యార్థినిలకు న్యాయ విజ్ఞాన సదస్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మాయిల భద్రతకు కఠినమైన చట్టాలున్నాయన్నారు. బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించిన కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో సీనియర్ మహిళా న్యాయవాది జయలతారెడ్డి, ఎస్‌ఏపీ కళాశాల ప్రిన్సిపల్ మందారికా, న్యాయవాదులు సారిక, డెబోరా, రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థిని పాల్గొన్నారు.

భూకైలాస్‌ను చూసొద్దాం రండి

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- 65 అడుగుల శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణ
- 18 శక్తిపీఠాలు, శనేశ్వరుడు, రేణుకా ఎల్లమ్మ విగ్రహాలు
- నీటిమార్గం గుండా శివుడి దర్శనం



భూకైలాస్ దేవస్థానం



శనేశ్వర విగ్రహం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం తండాలో వెలసిన ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం భూకై లాస్ బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది. .మహాశివరాత్రిని పురస్కరించుకొని గురువారం నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు శంకర్ నాయక్ పవార్, వాసునాయక్ పవార్‌లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు కర్ణాటక ,మహారాష్ట్ర ,హైదరాబాద్, మహబుబ్‌నగర్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. దేవస్థాన ఆవరణలో 65 అడుగుల శివుడి విగ్రహం, 30 అడుగుల ఆంజనేయస్వామి, కాలభైరవుడు, వీరభద్రేశ్వరుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అదేవిధంగా వినాయక విగ్రహం, తుల్జభవాని మాత, సేవాలాల్ దేవాలయాలు కూడా ఉన్నాయి.

నీటిమార్గం గుండా శివుడి దర్శనం

భూకై లాస్ దేస్థానానికి నీటి మార్గం గుండా వెళ్లి శివుడిని దర్శించుకోవడం ప్రత్యేకత. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

చూడాల్సిన విగ్రహాలు..

ముఖ్యంగా భూకై లాస్‌లో ఈ ఏడాది మహా శివరాత్రి సందర్భంగా వివిధ విగ్రహాలను దర్శనమిస్తాయి. 8 శక్తి పీఠాలు, శనేశ్వరుడు, రేణుల ఎల్లమ్మ, నవగ్రహాలు, కొనేరులో బుద్ధుడి విగ్రహం ప్రత్యేకతలుగా నిలిచాయి. నవదుర్గాలు, ఆత్మలింగం కూడా ఉన్నాయి.

ఏర్పాట్లు పూర్తి



మహా శివరాత్రి సందర్భంగా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఈసారి 18 శక్తి పీఠాల అమ్మవారి విగ్రహాల ఆవిష్కరణ ఉంటుంది. ఎల్లమ్మ విగ్రహంతో పాటు కోనేరులో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేశాం.

– వాసుపవారర్ నాయక్, భూకైలాస్ వ్యవస్థాపకులు. అంతారం తండా, తాండూరు మండలం

ఉపాధి కూలీలకు తాగునీటి సరఫరా

ధారూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు ఎంపీడీఓ నర్సింహులు, ఏపీఓ సురేష్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజుకు 2 లీటర్ల తాగునీటిని గ్రామ పంచాయతీ సరఫరా చేస్తుందని, డిసెంబర్ 2023లో ప్రభుత్వ సర్క్యులర్ వచ్చిందని, ప్రస్తుతం అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తాగునీటిని అందించేందుకు గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు తగిన చొరవ తీసుకోవాలన్నారు. తాగునీటి వసతి కల్పించని పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు.

సీసీ రోడ్లను పూర్తి చేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో జరిగే సీసీ రోడ్ల అభివృద్ధి పనులు ఆగకుండా పూర్తి చేసి, ఎఫ్‌టీఓ జనరేట్ చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ ఈఈ, డీఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ బిల్డింగ్, స్కూల్ కంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు.

టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అలీ పాషా సరెండర్

తుర్కయంజాల్: పురపాలక సంఘంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్‌కే అలీ పాషాను డీటీసీపీ ప్రధాన కార్యాలయానికి బుధవారం సరెండర్ చేసినట్లు కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలీ పాషా విధులలో నిర్లక్ష్యం వహించడం, విధుల పరంగా పలు ఆరోపణలు రావడంతో చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పొత్తును స్వాగతిస్తున్నాం..



మాట్లాడుతున్న నర్మద కిష్టప్ప

కొడంగల్ : బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తును స్వాగతిస్తున్నామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంగడి రాయిచూర్ నర్మద కిష్టప్ప అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఎస్పీ రాష్ట్ర సమన్వయ కర్త ప్రవీణ్‌కుమార్‌లు ఎన్నికల అవగాహనకు వచ్చినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షనా పోరాడాలని తీసుకున్న నిర్ణయాన్ని కొడంగల్ నియోజకవర్గం తరఫున పూర్తి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

లెక్చరర్ మోహన్‌రెడ్డి



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

బంట్వారం: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ లెక్చరర్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండలంలోని జిన్నారంలో మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్‌లోని ఈశా ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు భరత్‌రెడ్డి, విశ్వతేజ్ , అజయ్, స్మిత, చంద్రమోహన్, సీఓ వంశీ, కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పీర్లమాన్యం భూములను కాపాడండి'



తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం నాయకులు

ఆమనగల్లు: పట్టణంలో ఉన్న పీర్లమాన్యం భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు ముస్లిం నాయకులు కోరారు. తహసీల్దార్ లలిత, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వసంతను ఆమనగల్లు పట్టణానికి చెందిన ఎండీ ఫక్రుద్దీన్, ఎండీ మసామీయాల వారసులు కలిశారు. ఈ సందర్భంగా పీర్లమాన్యం భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని వారికి వినతి పత్రాలు అందించారు. ఆమనగల్లు పట్టణంలో 1/1లో 5.18 ఎకరాలు, సర్వే నం.1/2 ఆలో 7.27 ఎకరాలు, సర్వే నం.108, 109, 110, 111లలో పీర్లమాన్యం(మస్రుతి ఇనామ్) భూములు ఉన్నాయని వారు వివరించారు. గత కొన్ని తరాలుగా పీర్లమాన్యం భూములుగా ఉన్న విలువైన భూములను ఇటీవల కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. వెంటనే అధికారులు పీర్లమాన్యం భూములను గుర్తించి వాటిని ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని కోరారు. అలాగే ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో విన్నవించారు.

రగరాగ సూర్యుడు.. రగులుతుండు!



తాండూరు: వేసవి మొదట్లోనే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. సూర్యోదయం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వికారాబాద్ జిల్లాలో బుధవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని 20 మండలాల్లో 35 డిగ్రీల నుంచి 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయి. జిల్లాలోని యాలాల మండలంలో 39 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వారం రోజుల క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా 30 నుంచి 35 డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రత వారం రోజుల వ్యవధిలో 39 డిగ్రీల వరకు చేరుకొంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు సైతం అధికంగా నమోదవుతున్నాయి.

మండలాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా..

మండలం	కనిష్ట	గరిష్ట ఉష్ణోగ్రత
యాలాల	23.6	39.0
కొడంగల్	22.9	36.4
పెద్దేముల్	22.5	35.5
కుల్కచర్ల	21.4	36.4
పూడూర్	22.2	35.8
బొంరాస్‌పేట్	23.5	35.3
బషీరాబాద్	23.9	36.1
వికారాబాద్	23.5	35.2
దుద్యాల	22.1	35.2
పరిగి	23.4	36.1
బంట్వారం	22.2	38.0
ధారురు	22.7	36.3
నవాబ్‌పేట్	22.6	37.7
దౌల్తాబాద్	22.2	37.1
తాండూరు	23.3	38.1
మర్పల్లి	20.6	37.7
దోమ	22.8	37.4
మోమిన్‌పేట్	20.7	37.0
కోట్‌పల్లి	22.4	37.3
చౌడాపూర్	22.8	34.9